



WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

# విజయకెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 16 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 192 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY AUGUST 16 2026 | VOL:18 | ISSUE: 192 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## అర్హులందరికీ రేషన్ కార్డులు.. నిరంతర ప్రక్రియ: మంత్రి ఉత్తమ్

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటన

ఇప్పటికే 16 లక్షల కొత్త కార్డులు జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ



(మిగతా 4వ పేజీలో..)

## జెన్–జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ: తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విజయ్

చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

అవినీతిని అంతమొందించడం రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనన్న విజయ్

స్వాతంత్ర్య సమరయోధుల పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటన



(మిగతా 4వ పేజీలో..)

# ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

వరుసగా 13వసారి జెండా ఆవిష్కరణ

తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలపన

పూలవర్షం కురిపించిన వాయుసేన హెలికాప్టర్లు

**న్యూఢిల్లీ,ఆగస్ట్15(విజయకెరటం):**

దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని దిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. దిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం



'జనగణమన'ను ఆలపించారు. ఆ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం: సీఎం రేవంత్

గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి

ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించామని వ్యాఖ్య

తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికమని వెల్లడి

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య

గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ



(మిగతా 2వ పేజీలో..)

## బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది: కవిత

చరిత్రను అర్థం చేసుకున్నవారే దేశ భవిష్యత్తును అద్భుతంగా నిర్మించగలరన్న కవిత

బ్రిటీష్ వారి విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రమైందని వ్యాఖ్య

ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని మండిపాటు

ఆంగ్లేయుల పాలనలో జరిగిన దారుణాలు, సమాజాన్ని ముక్కలు చేయడానికి వారు అవలంబించిన 'విభజించి పాలించే' కుట్రల గురించి నేటి తరానికి



(మిగతా 2వ పేజీలో..)

## ఇండోనేషియాలో 7.7 తీవ్రతతో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ!

తీరప్రాంత ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశాలు

సముద్రంలో 10 కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం

పొరుగు దేశాలను కూడా అప్రమత్తం చేసిన అధికారులు

ఆగ్నేయాసియా దేశం ఇండోనేషియాను భారీ భూకంపం వణికించింది. శనివారం తెల్లవారుజామున దేశ తీరప్రాంతంలో సముద్ర గర్భంలో 7.7 తీవ్రతతో శక్తివంతమైన

(మిగతా 2వ పేజీలో..)



## పేదల చిరకాల స్వప్నం సొంతింటి కల సహకారం మంత్రి వెంకట్ రెడ్డి



**నల్లగొండ ఆగస్టు 15 విజయకెరటం ప్రతినిధి**

స్వాతంత్ర దినోత్సవ వేళ నల్గొండ జిల్లా కేంద్రంలోని గొల్లగూడలో 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. పేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న అనంతరం నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ ప్రాంతంలో నిర్మించిన 552 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించడమే కాకుండా, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. అంతేకాక అక్కడే

(మిగతా 2వ పేజీలో..)

## 'ఆయన చెప్పింది నిజమే'.. రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!

అవినీతిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

రూ.5 లక్షల ఇంటికి 500 నిబంధనలంటూ మండిపాటు

రాజగోపాల్ మాటలతో ఏకీభవిస్తున్నానన్న కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

(మిగతా 4వ పేజీలో..)

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరుతో కొందరు అధికారా న్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుంటున్నారని రాజగోపాల్ చేసిన



విజయకేరటం
తెలుగు దినపత్రిక

# యూరియా...కష్టాలు

రెండు బస్తాల యూరియా కోసం కాళ్లు పట్టుకున్న వృద్ధ రైతు...

తెలంగాణలో ఇంకా కొనసాగుతున్న సంక్షోభం. ఆగస్టు 12, 2026న సోషల్ మీడియాలో వైరల్ అయింది. గుండెలు తరుక్కుపోయేలా ఉందీ దృశ్యం... తెలంగాణలో యూరియా సమస్య ఇంకా పూర్తిగా తీరలేదని స్పష్టం చేస్తోంది ఈ ఘటన.యాసంగి సీజన్ మొదలైన నేపథ్యంలో రైతులు మళ్లీ యూరియా షాపుల వద్ద, రైతు సేవా కేంద్రాల వద్ద గంటల చుట్టూ తిరుగుతున్నారు.

**యాప్‌తో వచ్చిన కొత్త ఇబ్బందులు :**

ప్రభుత్వం పారదర్శకత కోసం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. మీసేవా కేంద్రాల ద్వారా కూడా బుక్ చేసుకునే వీలు కల్పించింది. కానీ చాలా మంది వృద్ధ రైతులు, చిన్న రైతులు ఈ వ్యవస్థతో ఇబ్బంది పడుతున్నారు.

స్మార్ట్‌ఫోన్ లేని వారు, ఇంటర్నెట్ సరిగ్గా పనిచేయని గ్రామాల్లోని రైతులు

ఓటీపీ సమస్యలు, సర్వర్ గ్లిచ్‌లు

"నో స్టాక్" మెసేజ్‌లు వచ్చినా.. స్టాక్ ఉండటం, ఫ్లాష్ సేల్స్‌లా ఒక్కసారిగా స్టాక్ అయిపోవడం వీటివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్మార్ట్ ఫోన్లు ఉన్న రైతులు పనులు మానుకొని గంటల తరబడి యూరియా కోసం యాప్ తెరిచి, కంటి రెప్ప వాల్చకుండా చూస్తూ కూర్చోవాల్సి వస్తోంది. అయినప్పటికీ యూరియా బుక్ కావడం లేదు. షాపుల యజమానులు కొన్ని సెల్ నంబర్లు తమ వద్ద ఉంచుకొని యూరియా స్టాక్ అప్ లాడ్ చేసిన వెంటనే గబగబా ఆ నెంబర్ల తో నిమిషాల్లో బుక్ చేసేస్తున్నారు. దీంతో రైతులు కళ్ళు తెరిచి మూసే లోపు స్టాక్ అయిపోతోంది. వరి పొలానికి నిర్ణీత సమయం లో యూరియా చల్లాల్సి ఉంటుంది. సమయం దాటితే పొలం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే రైతు యూరియా సామానికి చల్లే ప్రయత్నం చేస్తాడు.

**బ్లాక్ మార్కెట్‌లో యూరియా...**

ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా బ్లాక్ మార్కెట్ ను అరికట్టలేకపోతోంది. సమయానికి యూరియా దొరక్కపోవడం తో రైతులు బ్లాక్ మార్కెట్ ను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది షాపుల యజమానులు యూరియా ను బ్లాక్ లో అమ్ముతున్నారు. ఒక్కో బస్తా ను ఆరు వందల రూపాయలకు విక్రయిస్తున్నారు.

**గతం నుంచి నేర్చుకోలేదా?..**

2025 ఖరీఫ్‌లోనూ తీవ్ర కొరత ఎదురైంది. కేంద్రం కేటాయింపులు తగ్గడం, రామగుండం ప్లాంట్‌లో ఉత్పత్తి ఆగడం, లాజిస్టిక్స్ సమస్యలు, డిమాండ్ పెరగడం వంటి కారణాలు చెప్పబడ్డాయి. కేంద్, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరి పై మరొకరు నిందలు మోపుకున్నాయి. రైతులు రోడెక్కరు. ఇప్పుడు 2026లోనూ ఇదే కథ పునరావృతమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాస్తూ అదనపు కేటాయింపులు కోరుతోంది. ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యం అంటున్నాయి. రైతులు మాత్రం... "మాకు యాప్ కాదు, యూరియా కావాలి" అని గగ్గోలు పెడుతున్నారు. పొలాల్లో యూరియా సకాలంలో చల్లకపోతే వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పసుపు రంగులోకి మారుతాయి. దిగుబడి 10–15 శాతం తగ్గే ప్రమాదం ఉంది. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు ఎక్కువగా నష్టపోతారు. అప్పులు పెరుగుతాయి. కుటుంబాలు ఇబ్బంది పడతాయి.మెదక్‌లోని ఆ వృద్ధ రైతు కాళ్లు పట్టుకుని ప్రార్థించిన దృశ్యం కేవలం ఒక ఘటన కాదు. అది వేలాది మంది రైతుల నిస్సహాయతకు ప్రతీక. డిజిటల్ వ్యవస్థ మంచిదే కావచ్చు. కానీ గ్రామీణ వాస్తవాలకు అనుగుణంగా సరళీకరించాలి. బఫర్ స్టాక్‌లు సరిపడా ఉంచాలి. బ్లాక్ మార్కెట్‌ను కఠినంగా అరికట్టాలి. కౌలు రైతులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.అన్నం పెట్టే రైతు.. యూరియా కోసం కాళ్లు పట్టుకుంటుంటే... ఆ సమాజం ఏమనాలి?.మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట్‌కు చెందిన ఓ వృద్ధ రైతు.. చెమర్చిన కళ్ల తో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) సిబ్బంది కాళ్లు పట్టుకుని వేడుకున్నాడు."అయ్యా... నీ కాళ్లు పట్టుకుని ప్రార్థిస్తా... రెండు బస్తాల యూరియా ఇవ్వండి. కొడుకులు లేరు...టేపు లో ఎలా చేయాలో తెలియదు. ఒక్క బస్తా అయినా ఇవ్వండి సార్..మీకు దణ్ణం పెడతా..."ఈ దృశ్యం

## తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింసతోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథకాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు.32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# పేదల చిరకాల స్వప్నం సొంతింటి కల సహకారం మంత్రి వెంకట్ రెడ్డి

( మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటుచేసిన సమావేశంలో లబ్ధిదారులందరికీ ఇంటి కేటాయింపు ఉత్తర్వులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 552 మంది లబ్ధిదారులకు ప్రతి కుటుంబానికి ఇంటి అవసరాల కోసం రూ.10 వేల చొప్పున తన సొంత నిధులతో ఆర్థిక సాయం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలివేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను సుమారు రూ.35 కోట్లతో పూర్తి చేసి పేదలకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇళ్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీ, నీటి కనెక్షన్లు వంటి మౌలిక వసతులను కూడా కల్పించామని చెప్పారు.పేదలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల వంటి పథకాలను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. నల్లగొండ గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో 143 మంది మైనార్టీలకు ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. తాను బతికున్నంతకాలం ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానని, తనకు చేతనైనంతవరకు పేదలకు సహాయం చేస్తానని మంత్రి తెలిపారు.ఇళ్లు పొందిన లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకుని సొంతింటిలో ఆనందంగా జీవించాలని కోరారు. గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో రేషన్ షాపు, సూపర్ బజార్ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.ఇండ్లు రాని అర్హులైన వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.నల్లగొండ పట్టణంలో ప్రతి వీధిలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని , సుమారు రూ 900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు పురోగతిలో ఉన్నాయని, మరో వెయ్యి కోట్లతో పట్టణంతోపాటు, చుట్టుపక్కల, మొత్తం రూ.2 వేల కోట్లతో నల్లగొండ పట్టణాన్ని రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పనులతో అభివృద్ధి చేయనున్నామని, రాబోయే రెండున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. నల్గొండ కార్పొరేషన్ లో ఇండ్లు రాని, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇచ్చేందుకుతిప్పర్తి--మునుగోడు రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, దుప్పలపల్లి రోడ్డు, దేవరకొండ రోడ్డు లలో స్థలాలను పరిశీలించడం జరిగిందని, అర్హులైన పేదలకు 75 గజాల స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.గత ఏడాది సుమారు 700 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున ఇళ్లు నిర్మించి ఇచ్చామని చెప్పారు. నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ ఎల్ బి సి వద్ద రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నల్లగొండలో అన్ని వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు 2,500 మంది విద్యార్థులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. నల్గొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ 552 ఇందిరమ్మ ఇళ్లకు గృహప్రవేశాలు చేయించడం అభినందనీయమని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించారని తెలిపారు. ఇంకా ఇళ్లు రాని అర్హుల కోసం నల్లగొండ నగరానికి నాలుగు వైపులా స్థలాలను పరిశీలిస్తున్నామని, మిగిలిన లబ్ధిదారులకు కూడా ఇళ్లు నిర్మించి అందిస్తామని చెప్పారు. ఎంపీ నిధులతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నివాస ప్రాంతంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలను సాకారం చేసేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ ప్రాంతంలో 24 బ్లాకుల్లో 552 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందిస్తున్నామని చెప్పారు. మొత్తం ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.36 కోట్ల వ్యయంతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇళ్లతో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు.పేదల చిరకాల స్వప్నమైన సొంతింటిని స్వాతంత్ర్య దినోత్సవం రోజున అందించడం సంతోషంగా ఉందని, లబ్ధిదారులు ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయ వీర్ రెడ్డి ,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆఫీస్ ఖాన్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకి లాల్ రాజ్ కుమార్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం, స్థానిక కార్పొరేటర్ జ్ఞానేశ్వరి మాజీ జెడ్పిసి గుమ్మల మోహన్ రెడ్డి. గృహ నిర్మాణ అధికారి డి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

మొదటి పేజీ తరువాయి)

పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీయ వస్త్ర కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, వైవిధ్యాన్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియజేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, రైతులు, బ్లాక్-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున మోదీ జెండా ఎగురవేయడం ఇది 13వసారి కావడం విశేషం. జెండా ఎగురవేసిన అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ రోజు మనమంతా 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందేమాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోంది. గతంలో ఐదు బలహీన దేశాల జాబితాలో ఉన్న భారత్.. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారింది' అని మోదీ అన్నారు.

# ఇండోనేషియాలో 7.7 తీవ్రతతో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ!

మొదటి పేజీ తరువాయి)

భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేయడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) ప్రకారం, భూకంపం రిక్టర్ స్కేలుపై 7.7గా నమోదైంది. సముద్ర ఉపరితలం నుంచి కేవలం 10 నుంచి 30 కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం ఉన్నట్లు ఇండోనేషియా ఏజెన్సీ (బీఎంకేజీ) కూడా ధ్రువీకరించింది. భూ ప్రకంపనల ధాటికి సమీపంలోని ద్వీపాలు, నగరాలు తీవ్రంగా కంపించడంతో.. నిద్రలో ఉన్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.భూకంప తీవ్రత ఎక్కువగా ఉండటం, సముద్రంలో చాలా తక్కువ లోతులో సంభవించడంతో సునామీ ముప్పు పొంచి ఉందని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని తీరప్రాంత ప్రజలు వెంటనే సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని ఆదేశించారు. 1 నుంచి 3 మీటర్ల ఎత్తు వరకు రాకాసి అలలు తీరాన్ని తాకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం (పీటీడబ్ల్యూసీ) కూడా ఫిలిప్పీన్స్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి దేశాలను అప్రమత్తం చేసింది.సమాచారం అందిన వెంటనే ఇండోనేషియా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (బీఎన్‌పీబీ) రంగంలోకి దిగింది. రెస్క్యూ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు పంపించింది. ఈ భూకంపం వల్ల పలు భవనాలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ప్రధాన భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు (ఆఫ్టర్‌షాక్స్) వచ్చే అవకాశం ఉన్నందున, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటం వల్ల ఇండోనేషియాలో భూకంపాలు, అగ్నిపర్వతాలు సర్వసాధారణం. 2004లో ఇదే ప్రాంతంలో సంభవించిన పెను భూకంపం, సునామీ సృష్టించిన విలయం మరువకముందే మరోసారి భారీ భూకంపం రావడం ఆందోళన కలిగిస్తోంది.

## బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది: కవిత

మొదటి పేజీ తరువాయి)

పూర్తి స్థాయిలో తెలియాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. మన చరిత్రను సరిగ్గా అర్థం చేసుకున్న వారు మాత్రమే దేశ భవిష్యత్తును అద్భుతంగా నిర్మించగలరని ఆమె అన్నారు. తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రెండు ప్రపంచ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలవంతంగా వాడుకుని వేలాదిమంది ప్రాణాలను బ్రిటీషర్లు బలితీసుకున్నారని మండిపడ్డారు. వారు తెచ్చిన విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రతరమైందని, అడవుల్లో ప్రశాంతంగా జీవించే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. ఇంగ్లీష్ మాట్లాడేవారే గొప్ప అన్నట్లుగా చూస్తూ, మాతృభాష అయిన తెలుగు మాట్లాడేవారిని తక్కువ చేసి చూడడం ఆనాటి గులాంగిరీకి నిదర్శనమన్నారు. చర్మం రంగును బట్టి మన మధ్య వైషమ్యాలు సృష్టించిన ఆనాటి మైండ్‌సెట్‌ను వీడి, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

విజయకేరటం
తెలుగు దినపత్రిక
ఆగస్టు | ఆదివారం | 16 | 2026



# భద్రతా ఫిచర్ లతో స్మార్ట్ రేషన్ కార్డులు.






- ముఖ్యమంత్రి నుండి సాధారణ పౌరుడి వరకు సన్న బియ్యమే తింటున్నారు.
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ.

**నల్లగొండ ఆగస్టు 15 విజయ కెరటం ప్రతినిధి**

రాబోయే రోజుల్లో పేద వారికి మరిన్ని సంక్షేమ పథకాలు-స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.రాబోయే కాలంలో పేదవారికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్గొండ కలెక్టరేట్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నీలగిరి మహిళా సమాఖ్య పెట్రోల్ బంకు ను ప్రారంభించడం జరిగిందని,సూపర్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, అలాగే గొల్లగూడలో 552 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేసి పేదవారిచే గృహప్రవేశం చేపయించి సొంత ఇంటి కల నెరవేర్చడం జరిగిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదవారికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వడంతోపాటు,కొత్త సభ్యులను రేషన్ కార్డులలో చేర్చామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డిలో ప్రారంభమైన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 3.40 కోట్లమందికి ప్రతి ఒక్కరికి కేజీ 50 రూపాయలు పైగా విలువ చేసే నాణ్యమైన 6 కేజీల సన్న బియ్యం ఉచితంగా ఇవ్వడం జరుగుతున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి సాధారణ పౌరుడి వరకు సన్న బియ్యం తింటున్నారని, రేషన్ కార్డు జారీ ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, రేషన్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే విచారణ చేసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. నల్గొండ జిల్లాలో నూతనంగా 81279 రేషన్ కార్డులు ఇవ్వడం ద్వారా 2,38,171 మందికి లబ్ది చేకూరిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదవారికి అవసరమైన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు,ఉచిత బస్సు ప్రయాణం ఉచిత విద్యుత్ రైతు భరోసా లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు 12 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకోవడం జరిగిందని,నల్లగొండ జిల్లాలో మొదటి సంవత్సరం నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని, రెండవ విడత 2500 చొప్పున ఇండ్లు మంజూరు అయ్యాయని, ఇంకా కావాలంటే ఎన్నైనా మంజూరు చేయించి నల్గొండ జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తానని ,అలాగే జిల్లాలో ప్రతి ఎకరానికి సాగు నీరు అందించేలా ప్రాజెక్ట్ లు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.నల్గొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హత ఉండాలంటే రేషన్ కార్డు ఉండాలని, ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని. తెలిపారు. ప్రతి రేషన్ కార్డుదారుకు సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పది ఏండ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డు ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం ప్రతి ఒక్కరూ తినేలా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నకిలీ రేషన్ కార్డులు తయారు చేసేందుకు వీలు లేకుండా 9 రకాల భద్రత ఫీచర్స్ తో స్మార్ట్ రేషన్ కార్డులు రూపొందించడం జరిగిందని, జిల్లాలో 1051 రేషన్ దుకాణాల ద్వారా 5.41 రేషన్ కార్డు ల లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి 6 కేజీల చొప్పున ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని జులై,ఆగస్టు,సెప్టెంబర్ మూడు మాసాలకు సంబంధించి బియ్యం పంపిణీ చేసామని వివరించారు. అనంతరం మంత్రి,ఎంపీ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చేతులమీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ సి శంకర్ నాయక్, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డిఓ అశోక్ రెడ్డి డి.ఎస్.ఓ వెంకటేశ్వర్లు, డిఎం రాంపతి నాయక్, చౌకధర దుకాణాల డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణ పరపతి సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు

**వరంగల్ మండల ప్రతినిధి విజయ కెరటం ఆగస్టు 15 :**

నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల పరపతి సంఘం, ఆధ్వర్యంలో హనుమకొండ కుమార్ పల్లి కార్యాలయం నందు శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలలో సంఘ కార్యదర్శి మొగిలిచర్ల శ్రీధర్ చేతుల మీదుగా జాతీయ త్రివర్ణ జెండాను ఆవిష్కరించి జాతీయ జెండాకు గౌరవ



వందనం చేసి గీతాలాపన చేశారు.ఈ వేడులలో నాగవెల్లి సాంబయ్య,చెన్న కేశవులు,ఉద్యమారి రవీందర్,చెన్న గోవర్ధన్ వనపర్తి చంద్రశేఖర్ నాగవెల్లి ప్రభాకర్,కోడెపాక హరి ప్రసాద్,సింగారపు కమల్ కుమార్, సింగారం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములై జిల్లాను ముందుకు తీసుకెళ్లాలి

**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు**

అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను ప్రజల మరింత చేరువకు తీసుకువెళ్లి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా శనివారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల శ్రమ ఫలితంగా మనకు స్వతంత్రం సిద్ధించిందని,మనందరం స్వతంత్ర ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు .ప్రస్తుతం భారతదేశం వివిధ రంగాలలో పరుగులు పెడుతున్నదని, అంతేకాక దేశంలో చిన్నవయసు. ఉన్న వారు ఎక్కువగా ఉన్న దేశంగా ఉందని ,దీన్ని అవకాశంగా తీసుకొని మరింత అభివృద్ధి సాధించేందుకు మనమందరం దేశానికి సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని, అయితే జిల్లాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములై ప్రభుత్వ అభివృద్ధి ,సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేఎం కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.



## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్

**నల్లగొండ ఆగస్టు 15 విజయ కెరటం ప్రతినిధి**



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి, జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో దేశ సమగ్రత, జాతీయ సమైక్యత, సోదరభావాన్ని కాపాడుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆకాంక్షించారు.దేశ సమగ్రత, ఐక్యతతో పాటు శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ గారు తెలిపారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారికి మెరుగైన, నాణ్యమైన సేవలను అందించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో పనిచేస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని ఎస్పీ గారు కోరారు. ప్రజల సహకారంతో శాంతియుత వాతావరణాన్ని కొనసాగిస్తూ నల్గొండ జిల్లాను మరింత సురక్షితమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**నల్లగొండ ఆగస్టు 15 విజయకేరటం ప్రతినిధి**



తిప్పర్తి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గౌరవ గ్రామ సర్పంచ్ శ్రీమతి బద్దం రజిత సుధీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.తదుపరి జాతీయ గీతాన్ని ఆలపిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని ZPHS బాల బాలికల హై స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించిన గ్రామ సర్పంచ్ బద్దం రజిత సుధీర్ .ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, యువజనులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ గారు పిలుపునిచ్చారు.



# “మన యూత్” ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వరంగల్ మండల ప్రతినిధి, ఆగస్టు 15, విజయ కెరటం :**



ఆగస్టు 15 కేవలం చారిత్రక జ్ఞాపకం మాత్రమే కాకుండా, దేశం యొక్క ఐక్యతను ప్రతిబింబించే ప్రత్యేక ఘట్టంగా నిలుస్తోందని 21వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మహమ్మద్ ఫుర్ఖాన్ అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ కాశిబుగ్గ తిలక్ రోడ్ లోతుకుంటలో “మన యూత్ అసోసియేషన్ “ఆధ్వర్యంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మహమ్మద్ ఫుర్ఖాన్ విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.అనంతరం వితంతువులకు మహిళ వృద్ధులకు మన యూత్ కమిటీ సభ్యులు తీసుకొచ్చిన అల్పాహార ప్యాకెట్లను కార్పొరేటర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుబావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. దేశానికి త్యాగమూర్తుల చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివన్నారు.యువజన నాయకులు వృద్ధ మహిళ పట్ల సేవ చేయడం ఎంతో అభినందించదగ్గ సామాజిక కార్యక్రమం. ఇది సమాజంలో వృద్ధుల పట్ల ప్రేమను, బాధ్యతను చాటుకన్నారని అభినందించారు. ఇందులో భాగంగా యూత్ కమిటీ సభ్యులు కార్పొరేటర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మన యూత్ ప్రధాన కార్యదర్శి ఈదునూరి అజయ్ కుమార్, కోశాధికారి బిర్రు రాజు, ఉపాధ్యక్షుడు బిర్రు సంపత్, సహాయ కార్యదర్శి ఇసంపల్లి కుమారస్వామి,, సహాయ కో కార్యదర్శి ఇమ్మడి రాజు, ఆర్గనైజర్ దౌడు నిఖిల్, యూత్ కమిటీ సభ్యులు కన్నబోయిన ప్రదీప్, ఐత సుమన్ తదితరులు పాల్గొన్నారు

విజయకెరటం
తెలుగు దినపత్రిక

# అర్హులందరికీ రేషన్ కార్డులు.. నిరంతర ప్రక్రియ: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేవారని, అయితే తమ ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి సన్న బియ్యాన్ని సేకరిస్తోందని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఆహార భద్రతకే కాకుండా, అది ఒక కుటుంబానికి ప్రభుత్వం కల్పించే గౌరవం, గుర్తింపు అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి, త్వరలోనే వారికి కూడా కార్డులు జారీ చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# 'ఆయన చెప్పింది నిజమే'.. రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!

మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ అన్నారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5-6 లక్షలు ఇవ్వాలంటే ప్రభుత్వం 500 నిబంధనలు పెడుతోందని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. అదే సమయంలో పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు.రాజగోపాల్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేశారు. అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న వారిపై పోరాడతానని హెచ్చరించారు. తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని అన్నారు. పేదల ఇళ్ల విషయంలో నిబంధనలు కఠినంగా పెడుతున్న ప్రభుత్వం భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న రాజగోపాల్ రెడ్డి మాటలు నిజమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలను సొంత పార్టీ ఎమ్మెల్యేలే చేస్తున్నారని చెప్పారు. తెలంగాణను రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని చెబుతున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. మరి అలాంటి ఆరోపణలు వస్తున్నప్పుడు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు జరిగినా ఆ తర్వాత ఎలాంటి చర్యలు కనిపించలేదన్నారు.

# జెన్-జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ: తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విజయ్

మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాజకీయ ప్రత్యర్థులకు బలమైన హెచ్చరికలు జారీ చేయడంతో పాటు యువత, సామాజిక మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించిన ఆయన, రాష్ట్రంలో అవినీతిని అంతమొందించడం కూడా ఒక రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనని స్పష్టం చేశారు.రాష్ట్రాభివృద్ధిలో జెన్-జీ, యువతదే కీలక పాత్ర అని పేర్కొన్న విజయ్... కులం, మతం పేరుతో ప్రజలను విభజించే సంకెళ్లను తెంచినప్పుడే దేశంలో నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని అన్నారు. తమిళనాడు హక్కులు, భాషా విధానం, ఆర్థిక వాటా విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని... కేంద్ర ప్రభుత్వంతో పరిపాలనాపరమైన సహకారం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యలనైనా తీవ్రంగా నిరోధిస్తామని హెచ్చరించారు. ఇదే వేదికపై స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమం కోసం పలు కీలక ప్రకటనలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. అలాగే వీరపాండ్య కట్టబొమ్మన్, వి.ఓ. చిదంబరం పిళ్లై వంటి వీరుల వారసులకు ప్రత్యేక నిధులను ప్రకటిస్తూ, రాబోయే రోజుల్లో సుపరిపాలనతో తమిళనాడును సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని తెలిపారు.





# వంటల షోకు హోస్ట్‌గా సమంత.. 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్'తో సందడి!

స్టార్ హీరోయిన్ సమంత సరికొత్త అవతారంలో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ వంటల రియాలిటీ షో 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్' తమిళ వెర్షన్‌కు ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమం ప్రముఖ ఓటీటీ వేదిక 'సోనీలివ్' తమిళ్‌లో ప్రసారం కానుంది. ఈ విషయాన్ని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా శనివారం అధికారికంగా ప్రకటిస్తూ, షోకు సంబంధించిన ప్రోమో వీడియోను విడుదల చేసింది.బనిజయ్ ఆసియా సంస్థ నిర్మిస్తున్న ఈ షోలో తమిళ చలనచిత్ర, టెలివిజన్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పోటీపడనున్నారు. నిత్యం షూటింగ్‌లతో బిజీగా ఉండే ఈ సెలబ్రిటీలు, వంటగదిలో ఎదురయ్యే క్లిష్టమైన సవాళ్లను ఎలా అధిగమిస్తారనేది ఆసక్తికరంగా మారనుంది. అనేక మలుపులతో సాగే ఈ పోటీలో, తమ వంటకాలతో న్యాయనిర్ణేతలను మెప్పించి విజేతగా నిలవాల్సి ఉంటుంది. ఈ షో ప్రసార తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్వాహకులు వెల్లడించారు.ఈ కొత్త బాధ్యతపై సమంత స్పందిస్తూ, "నేను ఇప్పటివరకు ఇలాంటి భిన్నమైన షో చేయలేదు, అందుకే ఈ అవకాశం రాగానే వెంటనే అంగీకరించాను. ఈ షో ద్వారా సెలబ్రిటీల సరికొత్త కోణాన్ని చూడవచ్చు. వారు చేసే పొరపాట్లు, తీసుకునే రిస్కులు ప్రేక్షకులకు చాలా ఆసక్తికరంగా అనిపిస్తాయి" అని తెలిపారు. గతంలో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి వెబ్ సిరీస్‌లతో ఓటీటీ వేదికగా ప్రేక్షకులను అలరించిన సమంత, ఒక రియాలిటీ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

# విభిన్న కథతో శ్రీవిష్ణు.. 'కామ్రేడ్ కళ్యాణ్' విడుదల తేదీ ఫిక్స్

విలక్షణ కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదల తేదీని చిత్రబృందం శనివారం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 9న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలిపింది.ఈ విషయాన్ని శ్రీవిష్ణు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. "కామ్రేడ్స్! అక్టోబర్ 9న థియేటర్లలో మన 'కామ్రేడ్ కల్యాణ్'తో 'లాల్ సలాం' చెబుదాం" అంటూ విడుదల తేదీ పోస్టర్‌ను షేర్ చేశారు. జనక్‌రామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి పతాకంపై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు.1992 నాటి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా కథ సాగనుంది. శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌తో పాటు సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్, మలయాళ నటుడు షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఇప్పటికే 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా నుంచి జూన్‌లో విడుదలైన 'ఒరియా పిల్ల' పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ గీతాన్ని సిద్ శ్రీరామ్ ఆలపించగా, భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి సాయిశ్రీరామ్ సినిమాటోగ్రఫీ, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528